ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 13.01.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్ లుగా ఎంపికైన అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈరోజు నియామక పత్రాలు అందజేస్తారు.
2. సిరిసిల్ల మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం నిధుల కింద 30 కోట్లు, అమృత్ పథకం కింద 104 కోట్ల రూపాయలు అందించిందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.
3. అంతర్జాతీయ పతంగులు, మిఠాయిల పండుగను రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు నుంచి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహిస్తుంది.
4. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని మంత్రి  తుమ్మల నాగేశ్వరరావు ఈరోజు ప్రారంభించారు.

-----------------------------

**నియామక పత్రాలు:**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన 1257 మంది అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈరోజు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఉస్మానియా మెడికల్ కళాశాల (కోఠి), మైదానంలో ఈ మధ్యాహ్నం నియామకపత్రాలు అందజేస్తారు.

**పిటిసి, సంగారెడ్డి**

-------------------------------

**సిరిసిల్ల కు నిధులు :**

సిరిసిల్ల మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం నిధుల కింద 30 కోట్ల రూపాయలు ఇచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. అమృత్ పథకం కింద 104 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. కేంద్రం ఇంత పెద్ద ఎత్తున నిధులిస్తే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చినట్టు చెప్పడంలేదని అన్నారు.

**పిటిసి, సిరిసిల్ల**

----------------------------

**పతంగుల పండగ**

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈరోజు నుంచి అంతర్జాతీయ పతంగులు, మిఠాయిల పండుగను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ వేడుకలను సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభిస్తారు. ఈనెల 15వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో 19 దేశాల ప్రతినిధులు, 15 రాష్ట్రాల నుంచి పతంగుల ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చినవారు సందడి చేయనున్నారు. వీటితో పాటు ప్రత్యేక ఆకర్షణగా వివిధ రాష్ట్రాల పిండి వంటలతో స్వీట్ ఫెస్టివల్, 100 చేనేత స్టాళ్లను ఏర్పాటు చేశారు.

**పిటిసి, హైదరాబాద్**

------------------------

**ధాన్యం బోనస్ :**

సన్నరకం వడ్లు విక్రయించిన రైతులకు క్వింటాలుకు 500 రూపాయల వంతున బోనస్ కింద 500 కోట్ల రూపాయలను పౌరసరఫరాల శాఖ విడుదల చేసింది. వీటిని రైతుల ఖాతాలలో జమచేసినట్టు తెలిపింది. దీనితో కలిపి ఇవప్పటివరకు రైతులకు విడుదల చేసిన బోనస్ 1 వెయ్యి 425.91 కోట్ల రూపాయలకు చేరింది.

డెస్క్

---------------------------

**టోల్ ప్లాజా - ట్రాఫిక్ జామ్**

సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి స్వగ్రామాల బాట పట్టిన ప్రయాణికుల సంఖ్య పెరగడంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీగా వాహనాల రద్దీ ఏర్పడింది. ఈ రోజు ఉదయం టోల్ ప్లాజా వద్ద సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ట్రాఫిక్ జామ్ కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ వాహనాలు వెళ్లేందుకు చర్యలు చేపడుతున్నారు.

**పిటిసి, యాదాద్రి భువనగిరి**

-------------------------

**రైల్వే రద్దీ:**

సంక్రాంతి రద్దీ నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ రైల్వే అధికారులను ఆదేశించారు. 'బుకింగ్ కౌంటర్లు, బోర్డింగ్‌లు, ప్రవేశ ద్వారాల వద్ద ప్రయాణికుల భద్రత కోసం ఆర్‌పీఎఫ్ బలగాలను వినియోగించుకోవాలని, పండగ నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రైళ్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రయాణికులకు అందించాలని సూచించారు. రైల్వే ప్రాంగణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాలని, సంజయ్‌కుమార్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**పిటిసి - హైదరాబాద్**

------------------------

**వేములవాడ ఆధ్యాత్మిక కేంద్రం**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడను గొప్ప ఆధ్యా త్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు.

**బైట్ ఆది శ్రీనివాస్**

ప్రాచిన కళలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ భీమేశ్వరసదన్ వద్ద కళావేదికపై అయిదురోజులుగా నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు సోమవారం రాత్రి నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతి థిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను పండితులను ఘనంగా సత్కరించారు.

**పిటిసి, రాజన్న సిరిసిల్ల**

--------------------------------

తుమ్మల

ఖమ్మం జిల్లాలో సాగునీటి వనరు సరిగా లేని రఘునాథపాలెం మండలాన్ని సస్యశ్యామలం చేస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈరోజు ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని మంత్రి ప్రారంభించారు. సాగునీటి వనరు లేని ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో తమ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకంగా మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించుకున్నామని అన్నారు. ఎత్తిపోతల పథకంతో మండల ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని మంత్రి చెప్పారు.

**పిటిసి, ఖమ్మం**

------------------------------

**ఓటర్ జాబితా :**

రానున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి, ఆసిఫాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీల తుది ఓటర్ జాబితాను ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు విడుదల చేశారు. ఆసిఫాబాద్ నూతనంగా మున్సిపాలిటీగా ఆవిర్భవించగా మొదటిసారిగా జరుగుతున్న ఎన్నికలకు 20 వార్డులలో 13 వేల 927 మంది ఓటర్లు ఉన్నారు. కాగజ్ నగర్ లో 30 వార్డులలో మొత్తం 51 వేల 205 మంది ఓటర్లు ఉన్నారు. ఈనెల 5న ముసాయిదా ఓటర్

జాబితా విడుదల చేశారు. అనంతరం వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని తుది ఓటరు జాబితాను విడుదల చేసినట్లు అధికారులు చెప్పారు.

**పిటిసి, ఆసిఫాబాద్**

----------------------------

**పరకాల ఓటర్ల జాబితా**

పరకాల మున్సిపాలిటీ పరిధిలో తుది ఓటర్ల జాబితా విడుదలచేశారు. 22 వార్డులలో మొత్తం 26 వేల 784 మంది ఓటర్లు ఉన్నట్టు కమిషనర్ అంజయ్య తెలిపారు. ఇటీవల ఓటర్ల ముసాయిదాను నోటీసు బోర్డులపై అంటించి వాటిపై అభ్యంతరాలను తెలియజేయాలని కోరగా, పరకాల మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి అభ్యంతరాలు అందలేదన్నారు. దీంతో తుది జాబితాను విడుదల చేసినట్టు వెల్లడించారు.

**పిటిసి, వరంగల్**

----------------------------------

**ఓటర్ల జాబితా**

నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, నిర్మల్, బైంసా మునిసిపాలిటీలలో ఓటర్ల జాబితాను నిన్న సాయంత్రం విడుదల చేశారు. నిర్మల్ లో 98 వేల ఓటర్లు, బైంసాలో 51 వవేలు, ఖానాపూర్ లో 17 వేల మంది ఓటర్లు ఉన్నారు. సంబంధిత పట్టణాలలో ఓటర్లు జాబితాలు పరిశీలించుకోవాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు పాలన అధికారి పైజాన్ అహ్మద్ కోరారు.

**పిటిసి, నిర్మల్**

---------------------------

**ఆసిఫాబాద్ లో చలిగాలులు:**

ఆసిఫాబాద్ జిల్లాలో చలిగాలులు వీస్తున్నాయి. గత వారం రోజులతో పోలిస్తే జిల్లాలో నిన్న రాత్రి రాష్ట్రంలోనే అత్యల్పంగా 10.7° ఉష్ణోగ్రత, తిర్యాని మండలంలోని గిన్నెదరిలో నమోదైంది. జిల్లాలోని 15 మండలాల్లో 14° కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనితో వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీ చేసింది.

**పిటిసి - ఆసిఫాబాద్**

------------------------

**ముఖ్యమంత్రి టూర్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 16న అదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పర్యటించనున్నారు. అదిలాబాద్ జిల్లాలో ఉన్న చనకా కొరట ప్రాజెక్టును ప్రారంభించి వేసవి కాలం పంటకు నీటిని వదలనున్నారు. అనంతరం నిర్మల్ జిల్లాలో ఉన్న సదర్ మట్ బ్యారేజీని ప్రారంభించి వేసవి పంటకు నీటిని వదలనున్నారు. నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మిని స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు.

**పిటిసి నిర్మల్ జిల్లా**

-------------------------------

**ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి తనిఖీ.....**

సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని జిల్లా ఎస్పి కే నరసింహ తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సూర్యాపేట జిల్లాలోని హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి-NH 65 మీదుగా ఎక్కువ వాహనాలు వెళుతున్నాయని, అనుకోని ప్రమాదాలు ఏమైనా జరిగితే తక్షణమే వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, కలెక్టర్ ఆదేశించారు.

**పిటిసి నల్లగొండ**

--------------------------

**విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ విచారణ**

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో అక్రమాలు జరిగినట్టు రాష్ట్ర విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ కు ఫిర్యాదులు అందిన క్రమంలో ఈ పనులపై రాష్ట్ర విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ విచారణ చేపట్టింది. ఇంజనీరింగ్ విభాగం నుంచి

ఏడు అభివృద్ధి పనుల దస్త్రాలను విజిలెన్స్ అధికారులు పరిశీలిస్తున్నారు. మొదటి విడతలో 50 లక్షల రూపాయల లోపు జరిగిన అభివృద్ధి పనుల పైన విచారణ జరపనున్నారు. ఇప్పటికే ఇద్దరు ఈఈల పరిధిలోని పనుల పైన ప్రాథమిక విచారణ పూర్తి చేశారు.

**పిటిసి - వరంగల్**

----------------------------------

**సీఎం కప్ :**

జోగులాంబ గద్వాల జిల్లాలోని ఇటిక్యాల మండల కేంద్రంలో ఇటిక్యాల గ్రామ సర్పంచ్ జీవెంధర్ రెడ్డి సీఎం కప్ ర్యాలీని ప్రారంభించి జ్యోతిని వెలిగించారు. ఈ ర్యాలీ ఇటిక్యాల మండల కేంద్రంలోని గ్రంథాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది.

**పిటిసి, జోగులాంబ గద్వాల**

-----------------------------

**గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు:**

జనవరి 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులచే సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, వివిధ శాఖల అభివృద్ధి తెలిపే విధంగా శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

**పిటిసి, నల్లగొండ**

-----------------------------

**వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ:**

రాజ్య స్థరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభను చాటి రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని సాధించి జాతీయ, సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ కి ఎంపికైన కరీంనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎస్.అర్చనను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు.

**పిటిసి, కరీంనగర్**

----------------------------

**ప్రజావాణి:**

హైదరాబాద్ నగర వ్యాప్తంగా జిహెచ్ఎంసి కార్యాలయాలలో నిన్న నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 207 ఫిర్యాదులు అందినట్టు అధికారులు ప్రకటించారు. ప్రధాన కార్యాలయానికి 37 ఫిర్యాదులు అందగా వాటిని సంబంధిత విభాగాలకు పరిశీలన కోసం అందజేసినట్టు తెలిపింది.

**పిటిసి, హైదరాబాద్**

------------------------------